


చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.5°/22.7°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

బ్రిడ్జి పనుల పరిశీలన



కేంద్ర బృందంతో కలిసి బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంగయ్య, ఆలూరు సాంబ

శింగనమల: శింగనమల మండలం తరిమెల – పెద్దవడుగూరు మండలం చిట్టూరు మధ్య పెన్నా నదిపై ఎంపీ రంగయ్య నిధులతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను కేంద్ర బృందం శనివారం పరిశీలించింది. కేంద్ర బృందం ఎంపీ ల్యాడ్స్ డిప్యూటీ డైరెక్టర్ అరిందం మోదక్ ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబ శివారెడ్డితో కలిసి బ్రిడ్జి పనుల గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి సర్పంచ్ ఓబిలేసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తరిమెల వంశీగోకుల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గ్లోబల్ హ్యాండ్ వాష్ డే



అనంతపురం అర్బన్: జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లో, అన్ని రకాల సంస్థల్లో ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీలు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రజాప్రతిధులూ పాల్గొనేలా చూడాలని చెప్పారు. విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, యువత, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. భోజనం చేసే ముందు, మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిన ఆవశ్యకతను, ఉపయోగాలను తెలియజేయాలని సూచించారు. సబ్బుతో చేతులు కడుక్కునే అలవాటు పాటించకపోతే కలిగే నష్టాలు, సంక్రమించే వ్యాధుల గురించి తెలియజేస్తూ చైతన్యపర్చాలన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: మాతా, శిశు మరణాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి పేర్కొన్నారు. గత నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రెండు మాతృ, ఆరు శిశు మరణాలపై డీఎంహెచ్‌ఓ తన కార్యాలయంలో శనివారం సమీక్షా నిర్వహించారు. పలువురు వైద్యులు, సిబ్బంది తీరు పట్ల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి గర్భిణికి 12 వారాలలోపు రిజిస్టర్ చేసుకుని ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మూడు యాంటినేటల్ చెకప్స్ చేయించాలన్నారు. హైరిస్క్ కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎక్స్‌పెక్టెడ్ డేట్ ఆఫ్ డెలివరీ(ఈడీడీ)కి కొన్ని రోజుల ముందుగానే ప్రభుత్వ ఆస్పత్రి, నెట్ వర్క్ ఆస్పత్రుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేసిన కేసులు తిరస్కరిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది నిర్భయంగా తన సెల్ నంబర్ 9849902397కు తెలపవచ్చన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి నెలా 10 ప్రసవాలు (ఒక్కో పీహెచ్‌సీ) చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, గైనకాలజిస్టు డాక్టర్ నిస్సార్‌బేగం, చిన్నపిల్లల వైద్య నిపుణులు శంకర్‌నారాయణ పాల్గొన్నారు.





• ఇది అవకాడో పంట. శెట్టూరు మండలం పెరుగుపాళ్యం పంచాయతీలోని వడ్డేపాళ్యం అనే మారుమూల గ్రామంలో రైతు సిద్ధారెడ్డి రెండెకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ఒక్కో మొక్కను రూ.200తో కర్ణాటకలో కొనుగోలు చేసి.. రెండెకరాల్లో 400 మొక్కలు నాటారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. సెంట్రల్ మెక్సికో ప్రాంతానికి చెందిన ఈ పంటను ఇక్కడ సాగు చేయడం విశేషం. ఈ రైతే మరో రెండెకరాలలో డ్రాగన్ ఫ్రూట్స్ పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

• ఇది బొమ్మనహాళ్ మండలం ఎల్‌బీ నగర్ రైతు శివయ్య మూడెకరాల్లో సాగుచేసిన అంజూర పంట. కర్ణాటకలోని కురుగోడు నుంచి మొక్కలు తీసుకొచ్చి సాగు చేశారు. ఎకరానికి పది టన్నులకు పైగా దిగుబడి తీస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు.









• ఇది డ్రాగన్ ఫ్రూట్ తోట. బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన రైతు కంచనగారి దామోదర్‌రెడ్డి తనకున్న పదెకరాలలో మూడేళ్ల క్రితం సాగు చేశారు. రూ.90 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాలలో అత్యధిక విస్తీర్ణంలో ఈ పంట సాగు చేసిన రైతు కూడా ఈయనే. తెలంగాణలో పర్యటించి అక్కడి రైతుల అనుభవాలను తెలుసుకుని మరీ పంట వేశారు. ప్రస్తుతం ఏడాదికి మూడు కోతలు వస్తున్నాయని, ఐదేళ్లు దాటితే దిగుబడి మరింత పెరుగుతుందని రైతు చెబుతున్నారు.

అనంత ఇంట.. అరుదైన పంట

- ఉద్యాన పంటల సాగులో వైవిధ్యం
- రకరకాల పంటలతో రైతుల ప్రయోగాలు
- అంజూర మొదలుకుని అవకాడో వరకు సాగు



బ్రహ్మసముద్రం మండలం ఎస్.కోనాపురం వద్ద రైతు దండు శ్రీనివాసులు సాగు చేసిన ఖర్జూరపు తోట

సాక్షి, అనంతపురం డెస్క్: ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు కరువు కాటకాలకు నిలయంగా ఉండేది. వేరుశనగ, పప్పుశనగ, కంది వంటి వర్షాధార పంటలు మినహా మిగిలిన పంటలు పెద్దగా సాగు చేసేవారు కాదు. వరుణుడు కరుణించి పంటలు పండితే సరి. లేదంటే రైతులకు నష్టాలు, కష్టాలే. ఇప్పుడు పరిస్థితులు మారాయి. సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. అరుదైన పంటలు సైతం సాగు చేస్తూ జిల్లాకు ప్రత్యేకతను తెచ్చి పెడుతున్నారు.

ప్రయోగాల్లో మేటి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు లక్షల హెక్టార్లకు పైగా ఉద్యాన తోటలు సాగులో ఉన్నాయి. ఇందులో పండ్లతోటలే 1.20 లక్షల హెక్టార్ల వరకు సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల్లో ప్రయోగాలు చేయడానికి రైతులు ఏమాత్రమూ వెనుకాడడం లేదు. చీనీ, మామిడి, అరటి, దానిమ్మ, బొప్పాయి, సపోటా, కళింగర, కర్బూజా వంటి పండ్ల తోటలను పెద్దఎత్తున సాగుచేస్తూనే..జిల్లాలో గతంలో వేయని పంటలనూ పరిచయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అంజూర, డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూరం, వాటర్ యాపిల్, యాపిల్ బెర్రీ, అవకాడో తదితర పంటలు 'అనంత' ముంగిటకు చేరాయి. వక్క, వెదురు, కలబంద, అశ్వగంధ వంటి తోటలనూ వాణిజ్య కోణంలో సాగు చేస్తూ రైతులు ప్రత్యేకతను చాటుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం..రైతుల ఉత్సాహం

ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. రైతులకు డ్రైల్యాండ్ హార్టికల్చర్, ఇతరత్రా పథకాల కింద సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందజేస్తోంది. తక్కువ నీటితోనే వాటిని సాగుచేసుకునేలా భారీ సబ్సిడీపై బిందు, తుంపర సేద్యపు పరికరాలను సైతం ఇస్తోంది. దీంతో రకరకాల తోటల సాగుకు ముందుకు వస్తున్నారు. ఇక కొందరు అభ్యుదయ రైతులు సొంత నిధులతోనే అరుదైన, విదేశీ పంటలను సైతం జిల్లాకు పరిచయం చేస్తున్నారు. వారిని చూసి మరికొందరు ఆయా పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. క్రమేణా ఆ పంటలను కూడా ప్రభుత్వం సబ్సిడీలు/ప్రోత్సాహకాల పరిధిలోకి తీసుకొచ్చి రైతులకు అండగా నిలుస్తోంది. డ్రాగన్, అంజూర, తైవాన్ జామ తదితర పంటలకూ ప్రోత్సాహకాలు అందిస్తుండడమే ఇందుకు నిదర్శనం.

ఉమ్మడి జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం : 2,02,000 హెక్టార్లు

ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తున్న పండ్లతోటలు : మామిడి, నిమ్మ, చీనీ, దానిమ్మ, అంజూర, జామ, డ్రాగన్ ఫ్రూట్, చింత, ఉసిరి, నేరేడు

ఉమ్మడి జిల్లాలో సాగులో ఉన్న అరుదైన ఉద్యాన పంటలు : అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూరం, యాపిల్‌బెర్రీ, వాటర్ యాపిల్, లిచీ, కలర్ క్యాప్సికమ్

పిల్లల్లో పునాది స్థాయి బలంగా ఉండాలి

- తొలివిడత ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ముగింపులో డీఈఓ నాగరాజు



మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాభ్యాసానికి సంబంధించి పిల్లల్లో పునాది స్థాయి బలంగా ఉంటే ఉన్నతస్థాయి చదువు సులువుగా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వి.నాగరాజు పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 అంగన్‌వాడీ పిల్లల్లో పునాది స్థాయి అక్షరజ్ఞానం, సంఖ్యలకు సంబంధించిన జ్ఞానాన్ని ఎలా నేర్పాలో అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడానికి డీఆర్పీల (ఎస్‌జీటీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్)కు తొలివిడత ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల డీఆర్పీలకు ఈ నెల 9 నుంచి అనంతపురం శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలో వసతితో కూడిన శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ పిల్లలకు అక్షరాలు, అంకెలు బాగా నేర్పిస్తే ఉన్నత తరగతుల్లో అభ్యాసం సులభంగా ఉంటుందన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) శిక్షణలో నేర్చుకొన్న అంశాలను మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమర్థవంతంగా చేర్చాలని సూచించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల పిల్లలకు నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్మెంట్ సర్వే జరుగుతుందన్నారు. దసరా సెలవుల తరువాత పిల్లలతో బాగా ప్రాక్టీస్ చేయించి రాష్ట్ర స్థాయిలో మన జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్టీ ప్రతినిధి కేశవరెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సమగ్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జీసీడీఓ మహేశ్వరి, ఎంఈఓలు, అసిస్టెంట్ ఏఎంఓలు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకులపై ఉక్కుపాదం



వివరాలు వెల్లడిస్తున్న తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, చిత్రంలో సీఐ హమీద్‌ఖాన్



రాయదుర్గంలో పట్టుబడ్డ ఆన్‌లైన్ మట్కా నిర్వాహకులతో పోలీసులు

- ఏడుగురికి జిల్లా బహిష్కరణ

తాడిపత్రి అర్బన్: మట్కా నిర్వాహకులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. తాడిపత్రిలో తరచూ కేసులు నమోదవుతున్నా ఏమాత్రం పద్ధతి మార్చుకోని ఏడుగురు మట్కా నిర్వాహకులపై జిల్లా బహిష్కరణ వేటు వేశారు. ఇందులో ఒక మహిళ ఉండటం గమనార్హం. మహిళపై జిల్లా బహిష్కరణ వేటు పడటం ఇదే ప్రథమం. ఇందుకు సంబంధించిన వివరాలను తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య, అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ శనివారం మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని మట్కా నిర్వాహకులు బుక్కపట్నం శివకుమార్ అలియాస్ చాకలి శివప్రసాద్, అలియాస్ పాకం శివ అలియాస్ శివపై 16, చుక్కలూరు చాంద్‌బాషాపై 13, మక్తుం పాల మాబుపై 15, దూదేకుల కుళ్లాయప్పపై 10, ఉద్యగిరి మాబున్నీపై 10, దుగువపల్లి పుల్లయ్య అలియాస్ సుబ్బరాయుడుపై 9, తుంగ రామాంజులరెడ్డిపై 11 కేసులు ఉన్నాయన్నారు. అయినా వీరు మట్కా కార్యకలాపాలను వీడలేదు. దీంతో వీరిపై జిల్లా బహిష్కరణ విధించడం కోసం ఎస్పీ అన్బురాజన్ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమి సదరు మట్కా నిర్వాహకులను జిల్లా నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏడుగురినీ జిల్లానుంచి బహిష్కరిస్తున్నట్లు డీఎస్పీ ప్రకటించారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ నిర్వహించరాదన్నారు. మట్కా నిర్వహించినా, ప్రోత్సహించినా చివరకు పోలీసులు సహకరించినా ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో ప్రజలను అశాంతికి గురి చేసే వారిపై కూడా పీడీ యాక్టు ప్రయోగించేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తుంటే ఎస్పీ నంబర్ 9440796800కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆన్‌లైన్ మట్కా నిర్వాహకుల అరెస్ట్

రాయదుర్గం: ఆన్‌లైన్ మట్కా నిర్వాహకుల గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు పర్యవేక్షణలో రూరల్ సీఐ యుగంధర్, బొమ్మనహాళ్, డీ హీరేహాళ్, కణేకల్లు ఎస్ఐలు జి.శివ, రంగడుయాదవ్, దుగ్గిరెడ్డి చాకచక్యంగా పది మంది ఆన్‌లైన్ మట్కా నిర్వాహకులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం రాత్రి రాయదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ యుగంధర్ మీడియాకు వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఆన్‌లైన్ ద్వారా మట్కా నిర్వహిస్తూ.. సొమ్మును కర్ణాటక రాష్ట్రం బళ్లారికి పంపుతున్నట్లు సమాచారం అందడంతో ఏకకాలంలో దాడులు నిర్వహించామన్నారు. కణేకల్లు మండలానికి చెందిన భార్గవ్, గోవర్ధనరెడ్డి, రామనాయుడు, బ్రహ్మానందరెడ్డి, బొమ్మనహాళ్ మండలానికి చెందిన జిలాన్, గంగాధర, డీ హీరేహాళ్ మండలానికి చెందిన లక్ష్మీనారాయణ, మల్లికార్జున, కల్యం మహేష్, మంగలి అనిల్‌ను అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి రూ.4,00,150 నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మట్కాను శాశ్వతంగా నిర్మూలిస్తామన్నారు.

ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై సంతృప్తి



కృత్రిమకాళ్లు అమర్చుకున్న నిరంజన్‌రెడ్డితో ఎంపీ రంగయ్య, డీడీజీ అరిందం మోదక్

అనంతపురం కార్పొరేషన్: అనంతపురంలో ఎంపీ ల్యాడ్స్ (లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్) నిధులు ప్రజల అవసరాల కోసం పూర్తిస్థాయిలో ఖర్చు చేయడంపై ఎంపీ లాడ్స్ డీడీజీ ఎస్‌హెచ్ అరిందం మోదక్ సంతృప్తి వ్యక్తం చేశారు. 2019లో రైలు ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన తాడిపత్రికి చెందిన నిరంజన్‌రెడ్డికి ఎంపీ నిధుల కింద రూ.14.79 లక్షల విలువ చేసే కృత్రిమ కాళ్లను శనివారం ఎంపీ తలారి రంగయ్య తన ఇంటి వద్ద డీడీజీ అరిందం మోదక్‌తో కలిసి అందజేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్, ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్రయోజనిక్ ట్యాంకర్‌ను వారు పరిశీలించారు. ఎంపీ నిధుల సద్వినియోగంపై అరిందం మోదక్ సంతృప్తి వ్యక్తం చేశారు. నిధులను సమర్థవంతంగా సద్వినియోగం చేసిన ఎంపీకి డీడీజీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీ రంగయ్య మాట్లాడుతూ పార్లమెంట్ నిధులను పంచాయతీ స్థాయి వరకు తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎంపీ నిధుల్లో 70 నుంచి 80 శాతం శ్మశానాల కోసం కేటాయించామన్నారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్, 8 గ్రామాల ప్రజలకు ఇబ్బందుల్లేకుండా బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.78 కోట్లు వెచ్చించామన్నారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మహబూబ్, సంగమేశ్వర హెల్త్ ఎయిడ్స్ అండ్ సర్జికల్ ఏజెన్సీస్ క్లినికల్ హెడ్ చంచల్ భారతి పాల్గొన్నారు.

రాచపాళెం రచనలు.. సీమ సాహిత్యానికి దర్పణాలు



రాచపాళెం రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు, సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రచనలు రాయలసీమ సాహిత్యానికి దర్పణాలు వంటివని వక్తలు కొనియాడారు. కేంద్రసాహిత్య అకాడమీ, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాల గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తన ఆరు దశాబ్దాల సాహితీ జీవిత విశ్లేషణతో రచించిన మూడు పుస్తకాల (విమర్శా పునర్నవం, మన నవలలు, మన కథానికలు) ఆవిష్కరణ మహోత్సవం శనివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి కవులు, రచయితలు, విద్యావేత్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలురు గౌరీశంకర్, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, డాక్టర్ గేయానంద్, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణ, బండి నారాయణస్వామి, డాక్టర్ నాగేశ్వరాచారి, టీటీడీ పాలకమండలి సభ్యుడు అశ్వత్థనాయక్, నవలా రచయిత రెడ్డప్పరెడ్డి, వరంగల్లు నుంచి విచ్చేసిన డాక్టర్ సంపత్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశాంక మౌళి తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై రాచపాళెం సాహిత్య విశిష్టతల గురించి మాట్లాడారు. రాచపాళెం రచయితలకు సాహిత్య మార్గాన్ని చూపడమే కాకుండా అందులోని ఎత్తుపల్లాల గురించి నిత్యం అధ్యయనం చేయిస్తుంటారని కొనియాడారు. సాహిత్య విలువలతో తూచి చెప్పే సాహిత్య విమర్శకుడిగా రాచపాళెం ప్రసిద్ధి చెందారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది సాహితీ విమర్శకులు రావాలని ఆకాంక్షించారు. అస్తిత్వవాదం ఏదైనా సమాజ నిర్మాణంపై ప్రభావం చూపిస్తుందని ఆయన నమ్మారన్నారు. అంతకు ముందు ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది. అరసం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి అధ్యక్షతన 'వర్తమాన తెలుగు సాహిత్య విమర్శ – వివిధ ధోరణులు' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త వల్లూరు శివప్రసాద్, వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్ మాట్లాడారు. డాక్టర్ అనితమ్మ సభాసమన్వయం చేయగా, డాక్టర్ జూటూరు షరీఫ్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కవులు 'జనప్రియ కవి' యంగన్న, మల్లెల నరసింహమూర్తి, నానీల నాగేంద్ర, ఈరన్న, రామలింగమయ్య, నబీరసూల్, మహాబోధి కృష్ణమూర్తి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, జిరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆనంద్, సురేష్, రియాజుద్దీన్, మధురశ్రీ, కృష్ణవేణి, డాక్టర్ అనంత మాలతి తదితరులు పాల్గొన్నారు.









మహిళా శక్తి అపారం

- తలచుకుంటే దేన్నయినా సుసాధ్యం చేయగలరు
- కలెక్టర్ గౌతమి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ
- అనంతపురానికి చేరుకున్న మహిళా సీఆర్‌పీఎఫ్ జవాన్ల బైక్ ర్యాలీ


మహిళా జవాన్లతో కలసి పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం రూరల్: మహిళా శక్తి అపారమని, వారు అనుకుంటే దేన్నయినా సుసాధ్యం చేయగలరని కలెక్టర్ గౌతమి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. 'ఆజాదీ కా అమృత్ - బేటీ బచావో - బేటీ పడావో' మహోత్సవంలో భాగంగా మహిళ సాధికారిత కోసం మహిళాశిశు అభివృద్ధి కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కన్యాకుమారి నుంచి గుజరాత్ వరకూ దాదాపు 150 మంది మహిళా సీఆర్‌పీఎఫ్ జవాన్లు చేపట్టిన బైక్ ర్యాలీ శనివారం అనంతపురం చేరుకుంది. ఈ సందర్భంగా మహిళా జవాన్లకు కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగంలో మహిళా శాస్త్రవేత్తల పాత్రను కొనియాడారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి ఎన్నో పథకాలు బాలికల విద్యకు దోహదపడుతున్నాయన్నారు. మహిళా సాధికారతపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పించి అందరిలో చైతన్యం తీసుకురావడానికి మహిళా జవాన్లు సాహసోపేత బైక్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం


బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని కలెక్టర్ గౌతమి అన్నారు. అనంత క్రీడాగ్రామం వేదికగా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్ గౌతమి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. రోజూ పని ఒత్తిడితో నలిగిపోతున్న ఉద్యోగులకు ఇలాంటి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయన్నారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ.. శని, ఆదివారాల్లో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ టీం, అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం డివిజన్ క్రికెట్ జట్లు ఇందులో పాల్గొంటున్నాయన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కింద క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో , బ్యాడ్మింటన్ ఐదు రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, తహసీల్దార్లు శ్రీధర్‌మూర్తి, హరికుమార్, రాము, మహబూబ్‌బాషా, కలెక్టరేట్ ఏఓ శ్రీధర్, కలెక్టర్ సీసీలు సంజీవ రెడ్డి, హరి, జాయింట్ కలెక్టర్ సీసీలు సంజీవరాయుడు, షెక్షావలి, రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల బీభత్సం

ఉరవకొండ: పట్టణంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ గదిలో కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా మరో గదిలోని బీరువాను ధ్వంసం చేసి రూ. లక్షల నగదు, విలువైన బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని వీరశైవనగర్‌లో నివాసముంటున్న గోపాలరెడ్డి శెనగల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి లోడు రావడంతో భార్యపిల్లలు ఇంట్లో నిద్రిస్తుండగానే బయట తలుపునకు తాళం వేసుకుని సరుకు అన్‌లోడ్ చేయించేందుకు వెళ్లాడు. అదే సమయంలో అటుగా వచ్చిన దుండగులు ఇంటి వేసిన తాళం గమనించి బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. ఓ గదిలో వ్యాపారి భార్య, పిల్లలు నిద్రిస్తుండడం గమనించి మరో గదిలోకి వెళ్లారు. అక్కడున్న బీరువాలను ధ్వంసం చేసి రూ.10 లక్షల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. పని ముగించుకుని ఆలస్యంగా ఇంటికి చేరుకున్న గోపాల్‌రెడ్డి ఇంటి తాళం బద్ధలు గొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దింపి నిందితుల ఆధారాలను సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

గుంతకల్లు రూరల్: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కసాపురం ఎస్‌ఐ గోపాలుడు వెల్లడించారు. ప్రపంచ కప్ క్రికెట్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్న ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెంచారు. శనివారం ఇండియా, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌కు సంబంధించి కసాపురం రోడ్డు సమీపంలోని మారుతీ నగర్ ఓపెన్ ప్లాట్స్‌లో క్రికెట్ బెట్టింగ్ సాగుతున్న విషయం తెలుసుకున్న గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ గోపాలుడు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గుంతకల్లు నివాసి పి.ధనుంజయ, బళ్లారికి చెందిన ఛత్రయ్య, వజ్రకరూరు మండలం గూళ్యపాలెం నివాసి రామాంజనేయులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.4.72 లక్షల నగదు, 96 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

డిసెంబరుకు భూ సర్వే పూర్తి

కుందుర్పి: 'జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్షా' పథకం కింద చేపట్టిన సర్వే ప్రక్రియ డిసెంబర్ లోపు పూర్తి చేయనున్నట్లు జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ రూప్లానాయక్, జిల్లా సర్వేయర్ రాంప్రసాద్ పేర్కొన్నారు. కుందుర్పి మండలం కెంచంపల్లిలో చేపట్టిన భూసర్వేను శనివారం వారు పరిశీలించారు. తొలి విడతలో 43 గ్రామాల్లో 1,43,968 ఎకరాల్లో, రెండో విడతలో 40 గ్రామాల్లో 89,237 ఎకరాల్లో, మూడో విడుతలో 30 గ్రామాల్లో 76,782 ఎకరాల్లో జగనన్న సర్వే పూర్తయిందన్నారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 1,24,275 ఎకరాల్లో హద్దు రాళ్ల పాతి, సంబంధిత రైతులకు భూహక్కు పత్రాలు అందజేసినట్లు వివరించారు. సర్వేలకు రైతులు సహరికస్తే రెండు నెలల్లోపు మొత్తం ప్రక్రియ పూర్తి చేసి శాశ్వత హక్కు పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ శిరోధర, గ్రామ సర్పంచ్ గంగాధర, సచివాలయ సర్వేయర్లు వీరాంజినేయులు, ప్రియాంక, బేబి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

అనంతపురం: నగర శివారులోని ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు హౌస్ వైరింగ్, మోటార్ రివైండింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత సాంకేతికత పరిజ్ఞానం, సౌకర్యాలతో హౌస్ వైరింగ్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్ పరికరాల రిపేర్లు, మోటార్ రివైండింగ్‌పై 45 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. వృత్తి నైపుణ్య శిక్షణతో పాటు కష్టమర్లతో వ్యవహరించడం, భావ వ్యక్తీకరణ నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు, 5వ తరగతి వరకూ చదువుకున్న వారు అర్హులు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం ఉచితంగా ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా టూల్ కిట్, సర్టిఫికెట్ అందజేస్తారు. అలాగే ఆసక్తి ఉన్న వారికి వివిధ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ కల్పిస్తారు. పూర్తి వివరాలకు 85000 74757, 77807 52418లో సంప్రదించవచ్చు.





క్లుప్తంగా

వైఎస్సార్ బీమా మొత్తం అందజేత


బీమా మొత్తం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

రాప్తాడురూరల్: మృతుడి కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా డబ్బును వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి చేతుల మీదుగా శనివారం అందించారు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ ఎన్‌ఆర్ కాలనీకి చెందిన బోయ రవి కుమార్ గతనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా మొత్తం రూ. 5 లక్షలు మంజూరైంది. తన నివాసంలో మృతుడి భార్య సుధకు ఆత్మారామిరెడ్డి అందించారు.

యువత దేశాభివృద్ధికి తోడ్పడాలి


అంబేడ్కర్ రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన పుస్తకాలను యువత చదివి దేశాభివృద్ధికి తోడ్పడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. భారత్ జూడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం అంబేడ్కర్ రచించిన పుస్తకాలను యువతకు అందించారు. మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల వాసు, నాయకులు రామానాయుడు, నాగరాజు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రామ్‌చరణ్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి బైబై..పల్లెకు రయ్ రయ్!


దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న దృశ్యం

విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు.. ఈనెల 14 నుంచి దసరా సెలవులు ప్రకటించగానే తల్లిదండ్రులు వచ్చి విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్తుండడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పట్టణం వదిలి.. పెట్టె, బ్యాగులు పట్టుకొని పల్లెలకు ఆనందంగా పరుగులు తీశారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:




ఊళ్లకు వెళ్తున్న వసతి గృహ విద్యార్థినులు


పిల్లలను ఊళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు


ఆటోలో నుంచి దిగుతున్న విద్యార్థినులు

17 నుంచి బాలికల హాకీ పోటీలు


శిక్షణ తీసుకున్న ఆంధ్రప్రదేశ్ హాకీ జట్టు

అనంతపురం: సౌత్ జోన్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ బాలికల హాకీ పోటీలు ఈ నెల 17 నుంచి 24 వరకు చెన్నైలో జరగనున్నాయి. ఇందులో పాల్గొననున్న ఆంధ్రప్రదేశ్ టీం 8 రోజులుగా ఆర్డీటీ స్టేడియంలో శిక్షణ తీసుకుంటోంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు బీసీ రమేష్ గౌడ్‌హాజరై మాట్లాడారు. సౌత్ జోన్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభను కనబరిచి, హాకీ ఆంధ్రప్రదేశ్‌కు , తద్వారా దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గుడ్‌చిల్డ్రన్స్ స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్, అనంతపురం జిల్లా హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ అనిల్‌కుమార్, ఆర్డీటీ కోఆర్డినేటర్ ఓబులేసు, నెదర్లాండ్స్ హాకీ ప్లేయర్ బెంజమన్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎంఎస్ అక్రమ్ బాషా, హాకీ కోచ్ ఆర్.దేవకి పాల్గొన్నారు.

మూడోరోజూ దీక్ష

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును కొనసాగించాలని ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, ఎస్సీ,ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, విద్యార్థి జేఏసీ నాయకులు గిరి, వంశీకృష్ణ కోరారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద చేస్తున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శనివారం మూడో రోజుకు చేరుకుంది.

ఆర్డీటీ స్కూల్‌కు వెళ్లే దారి మూసేశారు


ఆర్డీటీ స్కూల్‌కు వెళ్లే దారిలో బండలు పాతిన దృశ్యం


పాఠశాలకు దారి వదలాలని కోరుతున్న స్థానికులతో ఎంపీటీసీ, సర్పంచు

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ పాఠశాలకు వెళ్లే దారిని మూసి వేయడంతో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో దశాబ్దాల క్రితం ఆర్డీటీ స్కూల్ నిర్మించారు.

అయితే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులమాటలు విని దారికడ్డంగా బండలు పూడ్చారని సర్పంచు ఓబులేసు, ఎంపీటీసీ ఓబులేసు, కాలనీవాసులు తెలిపారు. గతంలో అది ప్రభుత్వ స్థలమైతే, రాముడు అనే వ్యక్తికి పట్టా ఇవ్వగా, అతను చాలా ఏళ్ల క్రితం మరణించాడన్నారు. రాముడు కొడుకు అనంతపురంలో స్థిరపడ్డగా, అదే గ్రామానికి చెందిన రాముడు బంధువు జ్యోతి అనే మహిళ ఆ స్థలాన్ని కొనుగోలు చేసిందన్నారు. కాగా ఆస్థలం ఆర్డీటీ స్కూల్‌కు వెళ్లే దారి కోసం ఉండాలని కాలనీవాసులు నిర్ణయిస్తే, టీడీపీ నాయకులు దళిత సంఘాలను అడ్డుపెట్టుకొని గొడవలు పెట్టేందుకు చూస్తున్నారని కాలనీవాసులు అన్నారు. ఈ విషయాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీవాసులు అంటున్నారు.

నేటి నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు


పూజలందుకునే అమ్మవారు


విద్యుత్ దీపాలంకరణలో కొత్తూరు అమ్మవారి శాల


విద్యుత్ దీప కాంతుల్లో అమ్మవారి ఆలయం


టవర్‌క్లాక్ వద్ద విద్యుత్ దీపాలతో అమ్మవారి రూపం ఏర్పాటు చేసిన దృశ్యం

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో పెద్ద ఎత్తున దసరా ఉత్సవాలు జరగనున్నాయి. నగరంలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 15 నుంచి 24 వరకు మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి రూపమైన లలితా త్రిపుర సుందరి అనుగ్రహం భక్తులకు కలగనుంది. శయోనోత్సవంతో వేడుకలు ముగుస్తాయి. కొత్తూరు, పాతూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేడుకలు జరగనున్నాయి.

నగరంలోని శివకోటి, శివబాలయోగి ఆశ్రమం, రెండో రోడ్డులోని చంద్రశేఖరేంద్ర సరస్వతి నిలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ, ఐదో రోడ్డులోని యల్లమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయాలు, తాడిపత్రి బస్టాండు చౌడేశ్వరి మాత, శృంగేరి మఠం శారదా మాత, మారుతీనగర్‌లోని రామాలయం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం పార్వతీ అమ్మవారు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: స్థానిక శిల్పారామంలో దసరా పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అనంత్ నాగ్ సంగీత్ స్వర్ కల్చర్ కమిటీ అధ్యక్షుడు నాగిసీప్రసాద్ ఆధ్వర్యంలో 200 మంది కళాకారులతో జానపదాలు, సినీ సంగీత కచేరీ ఉంటుందన్నారు.

• జయహో.. భారత్!

అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో శనివారం జరిగిన వరల్డ్ కప్ భారత్, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ విజయకేతనం ఎగురవేసింది. దేశవ్యాప్తంగా క్రీడాకారులే కాక, క్రికెట్ అభిమానులు, యువత పట్టరాని సంతోషంతో కేరింతలు కొట్టారు. మ్యాచ్ ప్రారంభం నుంచి క్రికెట్ అభిమానులు ఉత్కంఠతో టీవీలకు అతుక్కుపోయారు. మరికొందరు మ్యాచ్ జరుగుతున్నంతసేపూ అరచేతిలో మొబైళ్లు పట్టుకొని లైవ్‌లో చివరి వరకు చూస్తూ ఉండిపోయారు. విజయానంతరం చిన్నా పెద్దా తేడాలేకుండా ఎగిరిగంతేశారు.


భారత్ విజయం సాధించడంతో టవర్‌క్లాక్ సమీపంలో యువత ఆనందం

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


ఆర్‌ఎఫ్ రోడ్డులో పూజలందుకునే లక్ష్మీ సమేత వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన ఆదిదేవుడి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో నగరంలోని పలు వీధులు విద్యుత్ దీపాల కాంతులతో వెలుగులీనుతున్నాయి. నగరంలోని ఆర్‌ఎఫ్‌రోడ్‌లో ఉన్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు శోభాయమానంగా అలంకరించారు.

నిత్య వాహన సేవలు: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు 15వ తేదీన శేషవాహనం , 16న హంసవాహనం, 17న సింహ వాహనం, 18న హనుమద్ వాహనం, 19న గరుడ వాహనం, 20న గజ వాహనం, 21న చంద్రప్రభ వాహనం, 22న అశ్వవాహనంపై స్వామి భక్తులకు దర్శనమిస్తారు. 23న మహా రథోత్సవం, 24న చక్రస్నానం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. శ్రీనివాసనగర్‌లోని బాలాజీ మందిరం, హౌసింగ్ బోర్డు, రామనగర్ తదితర ప్రాంతాల్లోని శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరగనున్నాయి.

హక్కుల పరిరక్షణకు ఐక్యపోరాటాలు సాగించాలి

• సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


ప్రాంతీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం అర్బన్: కార్మికుల శ్రమను కార్పొరేట్ సంస్థలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు విమర్శించారు. కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్యపోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సీఐటీయూ రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముందుగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఓబులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత కార్మికులు, శ్రామికుల హక్కులు హరింపు మొదలయ్యిందన్నారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతోందన్నారు. కష్టం కార్మికులది, సంపద కార్పొరేట్లది అన్న చందంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధానాలు ఉన్నాయన్నారు. 44 కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు కోడ్‌లుగా తీసుకొచ్చి వెట్టిచాకిరీ వ్యవస్థలోకి కార్మికులను నెట్టివేస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో రాయలసీమ జిల్లాల సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఈఎస్ వెంకటేశ్, అంజిబాబు, ఏసురత్నం, నాగరాజు, చంద్రశేఖర్, రామాంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎల్లయ్య, శ్రీదేవి, నరసింహులు, సాయిబాబా, నాగభూషణం , జిల్లా నాయకులు వెంకటనారాయణ, ముర్తుజా, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు వడ్డీ లేని రుణాలు

అనంతపురం కల్చరల్: ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు అందించడం అభినందనీయమని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ అన్నారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఐదుగురికి రూ. 1 లక్షా 73 వేలు వడ్డీ రహిత రుణాలు అందించారు. రిజ్వాన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వ్యాపారులకు ఖిద్మత్ సొసైటీ ఆధ్వర్యంలో రుణాలు ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు కొత్త అకౌంట్ ఓపెన్ చేయడం ద్వారా లబ్ధి పొందొచ్చన్నారు. అనంతరం కాగజ్‌ఘర్ రిజ్వాన్ స్వయంగా రూ. 50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. వివరాలకు సెల్ : 8309295739, 8331847823 లో సంప్రదించాలని ఖిద్మత్ సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఖిద్మత్ సొసైటీ డైరెక్టర్లు యాసిర్‌సాబ్, జమీర్ సాబ్, అర్షద్‌సాబ్, బాబ్జాన్, బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు హాజీపీరా, సభ్యులు ఫిరోజ్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గుత్తి రూరల్: మండలంలోని నేమతాబాదు గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... నేమతాబాద్ గ్రామ శివారులో కంపచెట్లలో దుర్వాసన వస్తుండటంతో శనివారం కొందరు వెళ్లి పరిశీలించారు. అయితే కంప చెట్ల నడుమ సుమారు 45 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని మృతదేహం పడి ఉంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం దుర్వాసన వస్తుండటంతో మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు తెల్ల అంగి, బ్లూ కలర్ డ్రాయర్ ధరించాడు. మృతదేహానికి సమీపంలో పురుగుల మందుతో పాటుగా మద్యం బాటిల్ పడి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.